RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, జూన్ 25, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 64 | పేజీలు: 8 | వెల : రూ.1



## కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లాలి: కేటీఆర్



# కొత్త సీఎస్‌గా సంజయ్

హైదరాబాద్, జైన్ 24 : తెలంగాణ రాష్ట్ర తదుపరి ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌జాజు ఖరారయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఆయన ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్నారు. సంజయ్ జాజును తిరిగి తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం (జూన్ 23న) కీలక నిర్ణయం తీసుకొంది. ప్రస్తుత తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారని తెలిసిందే. ఈ క్రమంలో కొత్త ప్రధాన కార్యదర్శి రేసులో జయేశ్ రంజన్‌తో పాటు సంజయ్‌జాజ పేర్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి.. చివరకు జాజు వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. సీఎం రేవంత్ కోరిక మేరకు ఆయనను తెలంగాణకు బదిలీ చేసినట్లుగా వినిపిస్తోంది.సంజయ్ జాజు 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. గతంలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విజయవాడ సబ్‌కలెక్టర్‌గా సేవలందించారు. అంతే కాకుండా హైదరాబాద్ నగరపాలక సంస్థ a అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా పలు కీలక బాధ్యతలను నిర్వహించడంతో సీఎం రేవంత్ రెడ్డి.. జాజు వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. సంజయ్ జాజు

(మిగతా 2వ పేజీలో)

# సాయికృష్ణది కస్టోడియల్ డెత్..

## రిమాండ్ రిపోర్టులో నిర్ధారించిన సిట్

గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వాస్పత్రిలో సీఐ నాగరాజుకు వైద్య పరీక్షలు పూర్తికావడంతో 2వ ఏజేఎస్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సిట్.. రిమాండ్ రిపోర్టును సమర్పించింది. రిమాండ్ రిపోర్టులో సిట్ కీలక విషయాలను వెల్లడించింది. సాయి కృష్ణది కస్టోడియల్ డెత్ అని, డెడ్‌బాడీని డెస్ట్రాయ్ చేశారని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నా కోర్టులో హాజరుపర్చలేదని సిట్ వెల్లడించింది. సాయికృష్ణను నాన్ బెయిలబుల్ వారెంట్‌లో తీసుకువచ్చి మాయం చేశారు. మే 5 నుంచి జూన్ 19 మధ్య కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టాం. 17 మంది సాక్షులను విచారణ చేశాం. ఫోరెన్సిక్ బృందం సాయంతో సీసీటీవీ కెమెరా ఫీడ్ స్వాధీనం చేసుకున్నాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో హిమజ అనే స్టేషన్ సిబ్బందిని విచారించాం. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజ్ డేటా సిస్టమ్‌లో లేదు. సాయికృష్ణ మృతదేహాన్ని పోలీస్ స్టేషన్‌లోనే చూసినట్లు... మే5 నుంచి మే8 మధ్య సాయికృష్ణని కృష్ణలంక పీఎస్‌లో చూసినట్టు ఎస్ఐ వాంగ్మూలం ఇచ్చారు' అని రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. సాక్షాలను నాశనం చేయడానికి , పోలీసు కస్టడీలో లేకుండా పోవడానికి సీఐ నాగరాజే కారణం. సీసీటీవీ ఫుటేజ్ డేటా(1-5-26 నుంచి 1-6-26 వరకు) డీవీఆర్‌లో లేకుండా చేశారు. ఫోరెన్సిక్ బృందానికి పరీక్ష కోసం డీవీఆర్‌లను పంపించాం. సాయికృష్ణ మరణించాడని తెలిసినా కూడా కృష్ణలంక పోలీస్ సిబ్బంది ఆ సమాచారం మేజిస్ట్రేట్‌కు



చేరవేయలేదు. సాయికృష్ణ మరణించాడని అతని తల్లి స్టేషన్‌కు వెళితే సీఐ నాగరాజు దూషించాడు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి హెబియస్ కార్పస్ పిటిషన్ వేసినా కోర్ట్ ముందు వాస్తవాలను వెల్లడించలేదు. హైకోర్ట్ ముందు నిజాలు దాచారు , కోర్ట్‌ను తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలన్నీ గమనించాక సైంటిఫిక్ ఎవిడెన్స్ చెరిపివేయడం ద్వారా సాయికృష్ణను హత్య చేశాడని గుర్తించాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో ఆధారాలు పూర్తిగా ధ్వంసం చేశారు. అన్ని అంశాలు తెలుసుకోవాలంటే నిందుతుడైన నాగరాజును విచారించాల్సి ఉంది. జూన్ 2 కంటే ముందే సాయికృష్ణ మరణించాడని మేము విశ్వస్తున్నాం. కస్టడీలో ఉండగా గాయాలపాలై మరణించాడని అన్ని ఆధారాలు స్పష్టంగా చెబుతున్నాయి' అంటూ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ వెల్లడించింది. చివరకు సాయికృష్ణను కస్టోడియల్ డెత్ చేశారని సిట్ నిర్ధారించింది.



## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు

# సీఎం రేవంత్ హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 24 : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు.రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

# భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు



ముంబై, జూన్ 24,( వాయిస్ టుడే) : ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడడంతో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరి, ఇంధన, వాణిజ్య సంక్షోభం తలెత్తేలా కనిపించింది. కానీ తాజాగా అమెరికా- ఇరాన్ మధ్య జరిగిన శాంతి ఒప్పందంతో చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెండ్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి77.39 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతుంటే.. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి73.57 వద్ద ట్రేడ్ అవుతోంది.అయితే ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో, ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు అవసరానికి మించి పెరిగిపోతాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్ కంటే చాలా వేగంగా పెరుగుతుందని, తద్వారా 2027 నాటికి చమురు మిగులు ఏర్పడుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ పేర్కొంది. పశ్చిమ ఆసియాలో జరిగిన యుద్ధం కారణంగా రోజుకు14 మిలియన్ బ్యారెళ్ల (bpd) చమురు ఉత్పత్తి నిలిచిపోయిందని ×జూా అంచనా వేసింది.క్రిస్టల్ ఎనర్జీ గ్లోబల్ అడ్వైజర్ క్రిస్టాఫ్ రూహ్ల్ అభిప్రాయం ప్రకారం.. 2027 నాటికి ప్రపంచ సరఫరా, డిమాండ్ కంటే రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60 డాలర్ల కంటే కిందకు పడిపోయే అవకాశం ఉంది. దీని ప్రభావంతో భారత్‌లో ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని గేట్‌వే హౌస్‌లో ఎనర్జీ, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కనెక్టివిటీ సీనియర్ ఫెలో అమిత్ భండారీ తెలిపారు. అయితే ఈ తగ్గదల అనేది తక్షణమే ఉండకోవచ్చని.. దానికి దాదాపు 5-6 నెలల

(మిగతా 2వ పేజీలో)



## మహిళల కోసం ఎంత చేసినా ఒక్క అడుగు మిగిలే ఉంటుంది

### ::: టీఆర్ఎస్ కవిత

జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ లో వెటా ఇండియా ఉమెన్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు కవిత మాట్లాడుతూ ఈ ప్రపంచమే మహిళలకు వ్యతిరేకంగా ఉంది. ఎంత కష్టపడినా ప్రతిభ చూపినా సరే మహిళకు ఎక్కడో అడ్డుకట్ట పడుతోంది. సమాజంలో మార్పు కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. మహిళలు తమ లక్ష్యంపై నిర్ణయం తీసుకుంటే మీ మాట మీరే వినవద్దు. మహిళ సాధికారత కోసం వెటా ఇండియా సంస్థ, ఆ సంస్థ అధినేత ఝాన్సీ చేస్తున్న కృషి అభినందనీయం. మహిళల కోసం మనం ఎంత చేసినా సరే ఒక్క అడుగు మిగిలే ఉంటుంది. ఎంతో మంది మహిళలను పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా తయారు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇవ్వాళ ఇక్కడ జరుగుతున్న ఈ సదస్సుకు కూడా ఎన్నో రాష్ట్రాల నుంచి మహిళలు వచ్చారు. మహిళలంతా కూడా ఒక్కటే. మనమంతా ఒక్కటే కులం. ఇక్కడ ఉండేవి రెండే కులాలు.. ఒకటి మహిళల కులం, ఇంకొకటి మగవాళ్ల కులం. ఇవ్వాళ నేను ఒక మహిళ జడ్జి తో మాట్లాడుతూ మహిళ జడ్జిల సంఖ్య తక్కువ ఉందని అన్నాను. ఎగ్జామ్ రాసి వచ్చే మహిళ జడ్జిల సంఖ్య ఎక్కువగానే ఉంటున్నప్పటికీ ఆ తర్వాత పై స్థాయికి వెళ్లేందుకు మాత్రం వారికి అవకాశం రావటం లేదని చెబుతున్నారు. అంటే టాలెంట్, కష్టపడే గుణం ఉన్నప్పటికీ వాటి ఆధారంగా అవకాశాలు రావటం లేదు. అయినా సరే ఎంతో మంది మహిళలు ఇంటి పనులు చేసుకుంటూ కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. మగవాళ్లతో పోటీ పడి

(మిగతా 2వ పేజీలో)

# బరి తెగిస్తున్న మైనింగ్ మాఫియా



కరీంనగర్, జూన్ 24, ( వాయిస్ టుడే) : తెలంగాణలో మైనింగ్, రవాణా మాఫియా ఏ స్థాయికి తెగబడిందో అద్దం పట్టేలా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యంత దారుణమైన ఘోరం చోటుచేసుకుంది. జిల్లా రవాణా అధికారి ఎం. వెంకన్న సోమవారం తెల్లవారుజామున చేల్పూర్ పరిసరాల్లో విధి నిర్వహణలో ఉండగా, బొగ్గు లోడ్‌తో వేగంగా దూసుకొచ్చిన ఒక లారీ ఆయనపై నుంచి దూసుకెళ్లింది. ఆర్‌టీఓ ఆఫీస్ సమీపంలో అక్రమ రవాణా, ఓవర్‌లోడింగ్ తనిఖీలు చేస్తున్న క్రమంలోనే ఈ ప్రమాదం జరగడం, ఘటనా స్థలంలోనే ఆయన ప్రాణాలు కోల్పోవడం రవాణా శాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అందర్నీ షాక్‌కు గురి చేసింది. అయితే, ఇది కేవలం యాదృచ్ఛికంగా జరిగిన ప్రమాదమా? లేక కావాలనే జరిపిన హత్యా అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటన వెనుక బొగ్గు అక్రమ రవాణా మాఫియా హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భూపాలపల్లి ప్రాంతంలో ఓవర్‌లోడింగ్ లారీలపై గత కొంతకాలంగా రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. డీటీఓ వెంకన్న లారీలను ఆపేందుకు ప్రయత్నించినప్పుడు, డ్రైవర్ లారీని ఆపకుండా నేరుగా ఆయనపైకే పోనిచ్చాడని ప్రత్యక్ష సాక్షుల సమాచారం. సాధారణంగా అధికారులు తనిఖీలు చేస్తున్నప్పుడు వాహనాలను నెమ్మదించాల్సింది పోయి, ఏకంగా ఒక జిల్లా స్థాయి అధికారిని తొక్కుకుంటూ వెళ్లడం వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అధికారులను భయభ్రాంతులకు గురిచేసి తమ దందా సాగించుకోవాలనే ప్లాన్‌లో భాగమేనా అనే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘోర ఉదంతాన్ని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

గురువారం, జూన్ 25, 2026

# కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లాలి: కేటీఆర్

ఖమ్మం : వాయిస్ టుడే : ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని, తిరిగి కెసిఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పాలన రావాలని కోరుకుంటున్నారని అన్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాలు నష్టపోయాయని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ, వడ్ల బోనస్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాలో 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని, ప్రాజెక్టు కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని కేటీఆర్ తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రుల చేతిలో కీలక శాఖలు ఉన్నప్పటికీ జిల్లాకు ఆశించిన అభివృద్ధి జరగలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల ఇబ్బందులు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, మహిళలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి చేపట్టాలని, ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కార్యకర్తలు సీరియస్‌గా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలే పార్టీకి బలం అని పేర్కొన్న కేటీఆర్, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తనదేనని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం



ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, మెచ్చ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధు, తక్కెళ్లపల్లి రవీందర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేసిన వైసీపీ కాపు మిషన్



కాకినాడ జూన్ 24, ( వాయిస్ టుడే) : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరుగుతున్నాయి. గత ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలపై తీవ్రంగా మేధోమథనం చేస్తోంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలు, పాలనాపరమైన లోపాలపై పోరాటం కంటే.. వైసీపీ నాయకత్వం ప్రస్తుతం సామాజిక సమీకరణాల పునర్నిర్మాణంపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో తాము ఘోర పరాజయం పాలుకావడానికి, కూటమి చారిత్రాత్మక విజయం సాధించడానికి ప్రధాన కారణం.. కాపు సామాజికవర్గం ఒకేతాటిపైకి రావడమేనని వైసీపీ గట్టిగా నమ్ముతోంది. ఈ మార్పునకు సూత్రధారి పవన్ కల్యాణ్ అని డిసైడ్ అయిన జగన్ .. ఇప్పుడు పవన్ నుంచి కాపులను దూరం చేసే ఒక వ్యూహాత్మక మిషన్ ను తెరపైకి తెచ్చారు. పవన్ కల్యాణ్ ఎప్పటికీ తమ వైపు వచ్చే అవకాశం లేదని తేలిపోవడంతో.. ఆయనకున్న ప్రధాన ఓటు బ్యాంకు పునాదులను కదిలించడమే లక్ష్యంగా వైసీపీ ఒక సరికొత్త పొలిటికల్ గేమ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా వైసీపీలోని కీలక కాపు నాయకులను రంగంలోకి దించారు. పవన్ కల్యాణ్ కేవలం చంద్రబాబు ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని, కాపు సామాజికవర్గానికి దక్కాల్సిన డిప్యూటీ సీఎం లేదా పవర్‌ను త్యాగం చేశారని ప్రచారం చేయడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. పవన్ పై కాపు యువతలో, ఆ సామాజికవర్గ పెద్దల్లో నమ్మకం తగ్గించడం ద్వారా వారిని జనసేన నుండి దూరం చేయవచ్చనేది వైసీపీ ఆలోచన.అయితే, ఇక్కడే వైసీపీ ఒక పెద్ద పొలిటికల్ లాజిక్‌ను మిస్ అవుతోంది. కాపు సామాజికవర్గం పవన్ కల్యాణ్ వైపు భారీగా నిలిచిన మాట వాస్తవమే అయినప్పటికీ.. పవన్ వెంట కేవలం ఒకే ఒక్క సామాజికవర్గం లేదు. ముఖ్యంగా ఏపీలోని యువత , కులాలకు అతీతంగా ఉన్న న్యూట్రల్ ఓటర్లు, మహిళల్లో పవన్ కల్యాణ్‌కు ఒక విలక్షణమైన క్రేజ్ ఉంది. కూటమి ప్రభుత్వంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, క్షేత్రస్థాయి పర్యటనలు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్నాయి. కాబట్టి పవన్‌ను కేవలం 'ఒక్క కులానికే' పరిమితం చేయాలని చూసే వ్యూహం క్షేత్రస్థాయిలో ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే.వైసీపీ కాపు నేతలు చేసే విమర్శల వల్ల కాపు సామాజికవర్గంలో ఎంతమంది పవన్‌ను అనుమానిస్తారో చెప్పడం కష్టం. ఎందుకంటే గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కాపు సామాజికవర్గానికి మంచి ప్రాధాన్యత దక్కింది. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా అత్యంత కీలకమైన శాఖలను నిర్వహిస్తున్నారు. ఇలాంటి సమయంలో వైసీపీ చేసే చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ అనే విమర్శలు.. కాపు ఓటర్లలో సానుభూతిని పెంచి, పవన్‌కు మరింత దగ్గరయ్యేలా చేసే ప్రమాదం కూడా ఉంది.ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. ఒకవేళ వైసీపీ వ్యూహం ఫలించి, జనసేన లేదా కాపుల్లో పవన్ పై నమ్మకం కాస్త తగ్గితే.. జగన్ నేరుగా గెలిచేస్తారా? అంటే రాజకీయ విశ్లేషకులు కాదనే సమాధానం చెబుతున్నారు. ఎందుకంటే ఏపీలో యాంటీ-వైసీపీ సెంటిమెంట్ కేవలం కాపులకే పరిమితం కాలేదు. బీసీలు, ఎస్సీలలోని కొన్ని ప్రధాన వర్గాలు కూడా గత ఎన్నికల్లో వైసీపీకి దూరమయ్యాయి. కేవలం ఒక సామాజికవర్గాన్ని టార్గెట్ చేయడం వల్ల పోయిన ఓటు బ్యాంకు తిరిగి రాదు. మిగిలిన వర్గాల్లో నమ్మకం కలిగించకుండా కేవలం కూటమిని విడదీయాలని చూడటం వల్ల ఆశించిన ఫలితం దక్కకపోవచ్చునని చెబుతున్నారు. వైసీపీ ప్రస్తుతం ప్రజా పోరాటాలు, ప్యాకేజీలు, అభివృద్ధి వంటి అంశాల కన్నా సోషల్ ఇంజనీరింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. కానీ ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడినప్పుడే దానికి మైలేజ్ వస్తుంది. కూటమి ప్రభుత్వంలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని ఎత్తిచూపడం మానేసి.. కేవలం జనసేన ఓటు బ్యాంకును చీల్చడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుంటే.. అది న్యూట్రల్ ఓటర్లలో వైసీపీపై మరింత ప్రతికూలతను పెంచే అవకాశం ఉంది. పవన్ కల్యాణ్‌ను ఒక సామాజికవర్గ నాయకుడిగా ఫ్రేమ్ చేయాలనేది వైసీపీ దీర్ఘకాలిక వ్యూహం. దీనికి పవన్ కల్యాణ్ తన డెలివరీ, అడ్మినిస్ట్రేటివ్ స్కిల్స్‌తో ఎలా కౌంటర్ ఇస్తారనే దానిపైనే ఏపీ భవిష్యత్తు రాజకీయాలు ఆధారపడి ఉంటాయి. కూటమి బలంగా ఉన్నంతవరకు ఈ సోషల్ ఇంజనీరింగ్ మైండ్ గేమ్స్ వర్కవుట్ కావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అవకాశాలు కల్పిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారు: మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి

అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే మహిళలు ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వేటా) ఇండియా చాప్టర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా సాధికారత, ఉపాధి అవకాశాలు, గ్రామీణ మహిళల గ్లోబల్ ప్రభావం వంటి అంశాలపై ఈ సదస్సు నిర్వహించబడింది. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థులు హాజరయ్యారు. వేటా వ్యవస్థాపకురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు దానసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్), ఎమ్మెల్యే మామిడాల యశస్విని తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న వేటా వంటి సంస్థల సేవలను అభినందించారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఇటువంటి వేదికలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. వేటా వ్యవస్థాపకురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి జీవిత ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. గృహిణిగా జీవితాన్ని ప్రారంభించి విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి, అమెరికాలో వేటా సంస్థను స్థాపించి, ఇప్పుడు భారతదేశానికి విస్తరించడం మహిళల సామర్థ్యానికి నిదర్శనమన్నారు. మహిళలు విద్య, ఉపాధి, వ్యాపారం, పరిపాలన, రాజకీయ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని మంత్రి తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, వారి భాగస్వామ్యం లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. తన కుటుంబంలోని మహిళలు కూడా విద్య, ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో విజయాలు సాధించారని పేర్కొన్న ఆయన, మహిళల విజయానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం,



ముఖ్యంగా పురుషుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. మహిళల సమయాన్ని, శ్రమను గౌరవిస్తూ వారి ఆశయాలకు కుటుంబాలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ సమాజ పురోగతికి తోడ్పడుతున్న మహిళల గొంతుక మరింత బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, సంకల్పం ఉంటే మహిళలు ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. వేటా ఇండియా తెలంగాణ చాప్టర్ చేపట్టనున్న కార్యక్రమాలు మహిళలు, యువతులు, విద్యార్థినుల సాధికారతకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేసిన మంత్రి, హనుమండ్ల ఝాన్సీ రెడ్డి, నిర్వాహక బృందం, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కొత్త సీఎస్‌గా సంజయ్

2014 నుంచి కేంద్ర సర్వీసులో కొనసాగుతున్నారు. సీఎస్ రామకృష్ణారావు రిటర్మెంట్ దగ్గర పడుతుండటంతో ఆ స్థానంలో కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుని అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుందని సమాచారం. సీఎస్‌గా సంజయ్ జాజు బాధ్యతలు చేపడితే 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు.ఆగస్టు 2025లో పదవీ విరమణ చేసిన కె. రామకృష్ణారావుకు కేంద్ర ప్రభుత్వం మొదట 7 నెలల పొడిగింపును మంజూరు చేసింది. ఆ తర్వాత మరో 3 నెలల పాటు పొడిగించింది. దాంతో ఆయన పదవీ కాలం జూన్ 30తో ముగియనుంది.కుడ్లిగి రామకృష్ణారావు 1991 క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కాగా, ఆయనను 2025 ఏప్రిల్ 27న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఏప్రిల్ 30న బాధ్యతలు చేపట్టిన ఆయన సీఎస్‌గా కొనసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్థిక కార్యదర్శిగా, ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పలు హోదాల్లో పని చేసిన ఆయన పలు బడ్జెట్‌ల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు.

# భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

సమయం పడుతుందన్నారు.అంతేకాదు రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన మార్కెట్లలో భారీ మార్పులు రాబోతున్నాయని నిపుణులు అంటున్నారు. 2027 నాటికి ప్రపంచ చమురు సరఫరా రోజుకు సుమారు 8 మిలియన్ బ్యారెళ్లు పెరుగుతుందని, కానీ డిమాండ్ కేవలం 2 మిలియన్ బ్యారెళ్లు మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారీ ఎత్తున చమురు మిగులు ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాలకు ఎంతగానో ఉపశమనాన్ని కలిగిస్తోందని.. ఇది ధరలను తగ్గించడమే కాకుండా.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఏర్పడి కొరతను ఫుల్‌ఫిల్ చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. అమెరికా-ఇరాన్ ఒప్పందం ఇలాగే కొనసాగితే గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతులు క్రమంగా పుంజుకుంటాయని IEA భావిస్తోంది. శాశ్వత ఒప్పందం కుదిరి, ఇరాన్ ఎగుమతులపై ఆంక్షలు తొలగిపోతే, మరింత ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లలోకి వస్తుంది. ఇది సరఫరాను మరింత మెరుగుపరిచి, చమురు ధరలపై ఉన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొంది.

# మహిళల కోసం ఎంత చేసినా ఒక్క అడుగు మిగిలే ఉంటుంది

మరి కష్టపడుతున్నారు.. కానీ మనకు ఎక్కడో ఒక చోట అడ్డుకట్ట ఉంటుందని అన్నారు. మంచి జాబ్ చేస్తూ ప్రమోషన్ వచ్చే సమయంలో పెళ్లి చేస్తారు. పెళ్లి, పిల్లలు అంటూ కొన్ని సంవత్సరాలు గ్యాప్ ఇచ్చాక మళ్లీ పని చేయాలంటే జూనియర్లుగా చేయాల్సి వస్తుంది. అంటే ఈ ప్రపంచమే మనకు బయాస్డ్ గా ఉంది. ఆడ, మగ సమతౌల్యం అనేది లేదు. మహిళ సాధికారత జరగాలంటే ప్రభుత్వం, ఫ్యామిలీ, సోసైటీ అందరూ హెల్ప్ చేయాలి. అన్ని రంగాల్లో 50 శాతం మహిళ ఉద్యోగులు ఉండాలని ప్రభుత్వం ఒక ఆర్డర్ ఇచ్చిన సరే ఫ్యామిలీ సహకరించదు. తెలంగాణ వచ్చాక పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు సాధించుకున్నాం. కానీ ఆ 33 శాతం కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ కావటం లేదు. అంటే మహిళలకు ఇంట్లో, సోసైటీ నుంచి సపోర్ట్ ఉండటం లేదు. ఇప్పటికీ కూడా కొంచెం భిన్నంగా ఉంటే అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నేను ఒక రాజకీయ నాయకురాలిగా ఏదైనా మాట్లాడితే లక్ష మంది వరకు నన్ను ట్రోల్ చేసే ప్రయత్నం చేస్తారు. నేను మాట్లాడిన అంశంపై కాకుండా జెండర్ బేస్డ్ గా మాట్లాడుతుంటారు. అంటే ఈ ప్రపంచమే మనకు వ్యతిరేకంగా ఉంది. వెటా లాంటి ఆర్గనైజేషన్స్ ద్వారా కొంత మార్పు వస్తుంది. ఇప్పటికీ 2026 లో కూడా మన రాష్ట్రంలో 15-19 ఏళ్లలో పెళ్లై అమ్మలు అయిన వాళ్లు 7.2 శాతం ఉన్నారు. ప్రభుత్వాలు టీనేజ్ మ్యారేజ్ లను తగ్గించేందుకు ఎంత ప్రయత్నం చేసిన సరే పెద్దగా మార్పు రావటం లేదు. హైదరాబాద్ లో కూడా టీనేజ్ మదర్స్ 2.7 శాతం ఉన్నారు. అంటే ఆడపిల్లలకు పెళ్లి చేసి పంపిస్తే మన బాధ్యత తీరిందని తల్లితండ్రులు భావిస్తున్నారు. సమాజంలో ఒక్క రోజులో మార్పు రాదు. అందుకు ఆడ, మగ అందరూ కృషి చేయాలి. ఇప్పుడున్న యువత సోషల్ మీడియాలో ఫాలోవర్స్, లైక్స్ కోసం ఆలోచిస్తోంది. అది అల్గరిథమ్ బేస్డ్ గా ఉంటుంది. అలా కాకుండా సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తో ఉండాలి. ఇంటర్ నెట్, ఇప్పుడొచ్చిన ఏఐ కూడా బయాస్డ్ గా ఉంటుంది. అంటే గతంలో మహిళల మీద ఉండే వార్తలను, అభిప్రాయాలను బట్టే ఏఐ సమాచారం అందిస్తుంది. అందుకే మీరు ఎలా ఉన్నారన్నది మ్యాటర్ కాదు. మీ మనసులో ఉన్న లక్ష్యం కోసం ఎలా కష్టపడతారన్నదే మ్యాటర్. నిర్ణయం తీసుకోనే వద్దు.. తీసుకుంటే మాత్రం మీ మాట మీరే వినకుండా కష్టపడాలని అన్నారు.

# బరి తెగిస్తున్న మైనింగ్ మాఫియా

తీసుకుంది. డీటీఓ వెంకన్న మృతిపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని రవాణా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను ప్రత్యేక విచారణ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాదం జరిగిన తీరు, లారీ ఎక్కడి నుంచి వస్తోంది, ఎవరికి చెందింది, డ్రైవర్ వెనుక ఎవరైనా ఉన్నారా? అనే పూర్తి వివరాలపై ఆయన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.రహదారులపై అర్ధరాత్రి, తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించే ఫీల్డ్ అధికారుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందనే ఆవేదన సిబ్బందిలో వ్యక్తమవుతోంది. విచారణ అధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ పనుల్లో ఉండే అధికారుల రక్షణ కోసం ప్రభుత్వం సరికొత్త భద్రతా ప్రోటోకాల్స్‌ను తీసుకురానుంది. రాత్రి వేళల్లో తనిఖీలు చేసేటప్పుడు ఎలాంటి రక్షణ పరికరాలు వాడాలి, ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి, పోలీసు బందోబస్తు ఎలా ఉండాలనే అంశాలపై ఒక ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ఖరారు చేయనున్నారు. నిజాయితీగా పనిచేసే ఒక ఉన్నతాధికారి విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం వ్యవస్థను ఆలోచింపజేస్తోంది. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తేనే అసలు నిజాలు బయటకు రానున్నాయి. మైనింగ్, రవాణా మాఫియాల అండ చూసుకునే డ్రైవర్ ఈ సాహసానికి ఒడిగట్టాడా అనేది తేలాల్సి ఉంది.

# అదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు లైన్‌క్లియర్

అదిలాబాద్, జూన్ 24, (వాయిస్‌టుడే) : వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా సరికొత్త పుంతలు తొక్కబోతోంది. జిల్లా అభివృద్ధికి గేట్‌వేగా మారనున్న అదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని, త్వరలోనే దీనికి శంకుస్థాపన జరగనుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారికంగా ప్రకటించారు. ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారుల మధ్య జరిగిన ముఖాముఖి భేటీలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై అత్యంత కీలకమైన అవగాహన కుదిరిందని, దీంతో జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం కాబోతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఆదిలాబాద్ విమానాశ్రయ ఏర్పాటుపై ఉన్న అన్ని అనుమానాలకు ఈ ఢిల్లీ సమావేశం తెరదించిందని ఎమ్మెల్యే వివరించారు. ఎయిర్‌పోర్ట్ కోసం ఇప్పటికే గుర్తించిన 1,880 ఎకరాలకు అదనంగా, రన్‌వే విస్తరణ , భద్రతా ప్రమాణాల దృష్ట్యా మరో 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించనుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కు తక్షణమే 80 ఎకరాలు కేటాయించి, అక్కడ ఆధునిక టెర్మినల్ భవనం, విమాన రాకపోకలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయడానికి ఒప్పందం కుదిరింది. భూసేకరణ నిధుల విషయమై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తి సానుకూలత వ్యక్తం చేశారని పాయల్ శంకర్ స్పష్టం చేశారు.విమానాశ్రయ పరిధిలోని హైటెన్షన్ విద్యుత్ లైన్ల మార్పిడి కోసం రూ.340 కోట్లు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం సుమారు రూ.600 కోట్ల వ్యయానికి రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్ ద్వారా కేవలం ప్రయాణికుల రాకపోకలే కాకుండా, భారీ స్థాయిలో కార్గో సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల ఆదిలాబాద్ జిల్లాలో ఉత్పత్తయ్యే వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులను దేశ విదేశాలకు నేరుగా ఎగుమతి చేసే సువర్ణావకాశం లభిస్తుందన్నారు. అంతేకాకుండా, విమానాల నైట్ హాల్టింగ్, రిపేర్ల కోసం ప్రత్యేక హ్యాంగర్లు ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉందన్నారు. భూసేకరణ ముగిసిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం రేవంత్ రెడ్డిల చేతుల మీదుగా శంకుస్థాపన చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు.ఎయిర్‌పోర్ట్‌తో పాటు జిల్లా యువతకు మరో భారీ తీపి కబురును ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని రామాయి--రాంపూర్ గ్రామాల మధ్య ప్రతిపాదిత 'రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ' నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల అనుమతులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలోనే దీనికి కూడా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. రాబోయే ఒకటి నుంచి రెండేళ్ల వ్యవధిలోనే ఈ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తి చేసి, సిమెంట్ ఉత్పత్తిని ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ భారీ పరిశ్రమ ద్వారా స్థానికంగా ఉండే సుమారు 2,000 మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా , పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.జిల్లాలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలికేలా అదిలాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సున్నపురాయి నిల్వలను టెండర్ల ద్వారా మరికొన్ని సిమెంట్ పరిశ్రమలకు కేటాయించే అంశంపై కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక చర్చలు జరుపుతోందని ఎమ్మెల్యే వెల్లడించారు. జిల్లాకు ఇంతటి భారీ మేలు జరుగుతున్న తరుణంలో ప్రతిపక్షాలు అనవసర రాజకీయ విమర్శలు మానుకుని, అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టులకు సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా ప్రజల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

## ముఖ్యమంత్రి కి సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ లేఖ

సికింద్రాబాద్, జూన్ 24 (వాయిస్ టుడే ప్రతినిధి): ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ లేఖ రాశారు. ఈమెరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతంచేసి, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ లేఖను రాస్తున్నానన్నారు. సీపీఎం హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జూన్ 19న ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించాననీ, విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులతో చర్చించిన తర్వాతే వారు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను దృష్టికి తెస్తున్నానన్నారు. విద్యా శాఖను ముఖ్యమంత్రి చూస్తున్నందున తక్షణమే పరిష్కరించాలని కోరారు.

### అసంపూర్తి భవన నిర్మాణం

ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 800లకు పైగా విద్యార్థులు చదువుతున్నారనీ, గదులు సరిపోకపోవడంతో 2021లో ప్రారంభించిన అదనపు భవన నిర్మాణానికి రూ.4.5 కోట్లు కేటాయించినప్పటికీ, నిధుల విడుదల చేయకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. దీంతో తరగతి గదుల కొరత ఏర్పడి, పాఠశాలను రెండు షిఫ్టుల్లో నడిపిస్తున్నారని తెలిపారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం వరకు ప్రైమరీ స్కూలు, మధ్యాహ్నం తర్వాత హైస్కూలు నడుపుతున్నారనీ, అందువల్ల విద్యార్థుల విద్యా సమయం తగ్గుతోందనీ, సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇరుకైన గదుల్లో ఇబ్బందులు పడుతున్నారనీ చెప్పారు. తక్షణమే భవన నిర్మాణ నిధులు విడుదల చేయాలనీ కోరారు.

### మౌలిక సదుపాయాల లోపం

విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా సరిపడా వాష్‌రూమ్‌లు లేవనీ, చాలా వాష్‌రూమ్స్‌ల్లో నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు బకెట్స్‌తో నీటిని తీసుకెళ్తున్నారనీ, కొన్ని మరుగుదొడ్లకు డ్రైనేజ్ సౌకర్యంలేదనీ తెలిపారు. వర్షపు నీరు పాఠశాల ఆవరణలో నిలవడంతో చిన్నపిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీంతో పాటు పాఠశాల ప్రాంగణంలోకి బయటి వాహనాలను పార్కు చేయడంతో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయనీ చెప్పారు.

### ఉపాధ్యాయుల కొరత

పాఠశాలలో ఇంగ్లీష్, ఉర్దూ, బయాలజీ, పి.ఇ.టి పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, తక్షణమే ఈ ఖాళీలను భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు.

### డిజిటల్ విద్య యూనిఫాం, మధ్యాహ్న భోజనం

కంప్యూటర్ ల్యాబ్‌లో 12 కంప్యూటర్లలో 9 మాత్రమే పని చేస్తున్నాయనీ, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ లేకపోవడం వల్ల విద్యార్థులు డిజిటల్ విద్యకు దూరమవుతున్నారనీ అన్నారు. అలాగే, విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటివరకు విద్యార్థులకు యూనిఫాంలు అందలేదన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ నాణ్యత అధ్వాన్నంగా ఉంది. నాణ్యమైన ఆహారం అందక, విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారనీ, రాష్ట్ర వ్యాప్తంగా చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి ఏటా 20 శాతం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కొన్ని పాఠశాలలను కుదించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## ట్రాఫిక్, డ్రగ్స్ నివారణ, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్, జూన్ 24 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థుల్లో రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం సెయింట్ మైఖేల్ స్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి త్రిముల్గిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఆల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ షితల్ శర్మ, ఏజీఎం హర్షిత్, ఫెసిలిటీస్ మేనేజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు. అధికారులు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక దుష్పరిణామాలను వివరించి, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ భద్రత అంశంపై ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాల నుంచి రక్షణ పొందే మార్గాలను వివరించారు. వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని, డిజిటల్ వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ట్రాఫిక్ నియమాలను పాటించడం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడం, ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించడం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. అధికారులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు యువతలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

## స్వయం సహాయక మహిళలకు ఇందిరా మహిళా శక్తి ద్వారా చీరల పంపిణీ



జూబ్లీహిల్స్ 24 జూన్ (వాయిస్ టుడే): బోరబండ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా నగర్ అధ్యక్షుడు ఎం. రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి వై. పెద్దిరాజు, సంయుక్త కార్యదర్శి పారశురాం, ద్వారక గ్రూప్ ఇన్‌చార్జి అలివేలు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కీసరలో ఇందిరమ్మ చీరలు పంపిణీ



నాగారం, జూన్ 24:-(వాయిస్ టుడే): కీసరలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చేరల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చీరలు అందుకున్న మహిళలు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి మహిళలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తంచేశారు.

# అద్దెకు ఆర్టీసీ ఖాళీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు

**వ్యాపార విస్తరణకు టీజీఎస్ ఆర్టీసీ 'గోల్డెన్ ఛాన్స్'**

**టీజీఎస్ ఆర్టీసీతో చేతులు కలపండి, మీ వ్యాపారాన్ని పెంచుకోండి**

**ఎండీ వై.నాగిరెడ్డి**



సికింద్రాబాద్, జూన్ 24 (వాయిస్ టుడే ప్రతినిధి): ఎప్పటికప్పుడు సరికొత్త ప్రయాణ అనుభూతులతో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (౧+ూ౫జ) ఇప్పుడు వ్యాపార రంగంలోనూ సరికొత్త వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కేవలం ప్రయాణికులను చేరవేయడమే కాకుండా, సంస్థ పరిధిలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ వ్యాపార సముదాయాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు సంస్థ సిద్ధమైంది. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి, తమ సంస్థలను విస్తరించుకోవాలనుకునే వారికి ఇది ఒక బంపర్ ఆఫర్‌గా నిలవనుంది.

### సారథ్య ఆలోచన...సరికొత్త ఆదాయం

సంస్థను లాభాల బాట పట్టించడంతో పాటు, స్థానిక నిరుద్యోగులకు, వ్యాపారస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉన్నతాశయంతో టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. పారదర్శకమైన నిబంధనలు, లీజు పద్ధతుల ద్వారా ఈ స్థలాలను కేటాయించనున్నారు.

### ప్రజాక్షేత్రంలో వ్యాపార సామ్రాజ్యం

సాధారణంగా ఏ వ్యాపారానికైనా 'కస్టమర్ల రాక' అనేది అత్యంత కీలకం. ఆర్టీసీ బస్టాండ్లు, కాంప్లెక్స్‌లు నిరంతరం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల, ప్రచార ఖర్చులు లేకుండానే వ్యాపారస్తులకు కస్టమర్లు లభిస్తారు. హోటళు ,, ఫుడ్ కోర్టులు, సూపర్ మార్కెట్లు, బ్రాండెడ్ షోరూమ్‌ల నుండి చిన్న తరహా దుకాణాల వరకు అన్ని రకాల వ్యాపారాలకు ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్ లు అనువైన వేదికలుగా మారనున్నాయి.

### వ్యాపారులకు సువర్ణావకాశం

తెలంగాణలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, డిపోల పరిధిలో ఉన్న ఈ ఖాళీ వ్యాపార సముదాయాల వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ స్త్రంతీష్.వశ్రీఖఅస్త్రుఖ.స్త్రశీజ.అఅ లో పొందుపరచడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న 694 షాపులకు త్వరలో టెండర్లు పిలువబడుచున్నవి. టీజీఎస్‌ఆర్టీసీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అటు రవాణా సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తూ, ఇటు వ్యాపార రంగానికి సరికొత్త ఊతాన్ని ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ సువర్ణావకాశాన్ని అందుపుచ్చుకుని వ్యాపారంలో రాణించాలని సంస్థ వర్గాలు కోరుతున్నాయి.

### దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ ఆన్లైన్లో వివరాలు

ఆర్టీసీ చరిత్రలోనే సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, పారదర్శకతకు పెద్దపీట వేసేలా సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార సముదాయాల వివరాలను యాజమాన్యం అధికారిక వెబ్‌సైట్‌లో బహిరంగపరిచింది. ఏ ఏ ప్రాంతాల్లో ఎన్ని వ్యాపార సముదాయాలు ఉన్నాయి, అవి ఖాళీగా ఉన్నాయా లేక నిండిపోయాయా, ప్రస్తుతం ఆ షాప్ లను ఎవరు నిర్వహిస్తున్నారు, వారి లీజు కాలపరిమితి, అద్దె ఎంత అనే పూర్తి సమాచారాన్ని క్లియర్ కట్‌గా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్ పెడుతూ, వ్యాపార ప్రకటనలు, అద్దెదారుల ఎంపికలో డిజిటల్ జవాబుదారీతనాన్ని పెంచేందుకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ విప్లవాత్మక నిర్ణయం ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. టీజీఎస్ ఆర్టీసీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అటు రవాణా సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తూ, ఇటు వ్యాపార రంగానికి సరికొత్త ఊతాన్ని ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

### ఆర్టీసీతో చేతులు కలపండి, మీ వ్యాపారాన్ని పెంచుకోండి

ఆర్టీసీ స్థలాల్లో షాప్స్ నిర్వహణ ప్రక్రియను మరింత సరళతరం చేశామని, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ అవకాశాన్ని వాడుకోవచ్చని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సూచించారు. టీజీఎస్ ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదావకాశం వ్యాపారులకు ఎంతో లాభదాయకమని, దీనిని సద్వినియోగం చేసుకుని వ్యాపార వృద్ధిని సాధించడమే కాకుండా సంస్థ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఎండీ వై.నాగిరెడ్డి కోరారు.



## మేడిపల్లి నూతన సిఐకి TUWJ 143 క్లబ్ శుభాకాంక్షలు



మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, జూన్ 24 : మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.హెచ్.ఓ డి. జలంధర్ రెడ్డి నీ మేడిపల్లి మండలం టియుడబ్ల్యూజే 143 ప్రెస్ క్లబ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

**అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు**

**బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ**



బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, జూన్ 24 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నేడు 4 వార్డుల పరిధిలోని 17 పంపిణీ కేంద్రాల్లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద మొత్తం 23,694 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో స్వయం సహాయక సంఘాల (SHG) మహిళలు 21,889 మంది, SHG కాని మహిళలు 1,805 మంది ఉన్నారు. నేడు ప్రారంభమైన పంపిణీ కార్యక్రమం అన్ని కేంద్రాల్లో సజావుగా కొనసాగుతోంది. అర్హులైన లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు క్రమపద్ధతిలో కేంద్రాలకు వచ్చి చీరలను స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ఏ.శైలజా మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని పేర్కొన్నారు.




## ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం.!

**బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ**

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, జూన్ 24 : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో దోమల నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నేడు మూడు వాహనాలపై అమర్చిన ఫాగింగ్ యంత్రాలను (వెహికల్ మౌనంటెడ్ ఫాగ్గింగ్ మెషిన్స్) అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా కాలనీలు, నివాస ప్రాంతాలు మరియు ప్రజా ప్రదేశాలలో ఈ ఫాగింగ్ యంత్రాల ద్వారా విస్తృతంగా దోమల నివారణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాహ్నవి శశాంక్, ఎస్‌డబ్ల్యూఎం అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## నాగారంలో ఇందిరమ్మ చీరలు పంపిణీ

నాగారం, జూన్ 24:-(వాయిస్ టుడే): నాగారం డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మామిళ్ల నారాయణ కాలనీ పార్క్‌లలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందిరమ్మ చీరలను అందుకున్న మహిళలు ప్రభుత్వానికి మరియు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. పేద మరియు మధ్యతరగతి మహిళలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

# ఓయూలో రాష్ట్ర ఏఐ - డిజిటల్ లెర్నింగ్ మెంటార్‌షిప్ కార్యక్రమం ప్రారంభం

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ, కోడింగ్, డిజిటల్ నైపుణ్యాల బోధనకు శ్రీకారం




సికింద్రాబాద్, జూన్ 24 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అన్నా--అక్క మెంటార్‌షిప్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లెర్నింగ్ ట్రైన్-ది-ట్రైనర్ శిక్షణ కార్యక్రమం బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు కొనసాగే ఈకార్యక్రమం ద్వారా అధ్యాపక మెంటర్లకు ప్రత్యేక శిక్షణ అందించి, వారి ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను చేరవేయనున్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ, భవిష్యత్ విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికతల పాత్ర మరింత కీలకంగా మారనుందని అన్నారు. విద్యార్థులు ఉద్యోగార్థులుగా మాత్రమే కాకుండా సృజనాత్మక ఆవిష్కర్తలు, సమస్యల పరిష్కారకులు, సమాజ మార్గదర్శకులుగా ఎదగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు అకాడమిక్ క్రెడిట్లు కూడా లభిస్తాయని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా మార్గదర్శకత్వంలో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని వివరించారు. ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులకు లభిస్తున్న డిజిటల్ అవకాశాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ డి. సరిత మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 39 వేల మంది విద్యార్థి ఇంటర్న్లు, 520 మంది నోడల్ అధ్యాపకులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. వీరి ద్వారా తెలంగాణలోని సుమారు 9 వేల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏఐ, డిజిటల్ అక్షరాస్యత, కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం అమలులో జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ హైదరాబాద్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనరేట్, ఎస్‌సీఈఆర్‌టీ, ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మరియు పాఠశాల విద్యాశాఖలు భాగస్వాములుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమానికి ముందు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎ) వైస్ ప్రిన్సిపాల్, యూనివర్సిటీ నోడల్ అధికారి ఆచార్య బి. మంగు అధ్యాపక ప్రతినిధులకు స్వాగతం పలికారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధ్యాపకులు శిక్షణలో పాల్గొంటుండగా, భవిష్యత్ తరాలకు అవసరమైన డిజిటల్ నైపుణ్యాల పెంపుదలకు ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.




## చాలా ఆనందంగా ఉంది

### రమేష్ అనే పేద విద్యార్థి ఎంబిబిఎస్ చదవాలనే కోరికని నెరవేర్చిన శ్రీ ఎస్ పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ శ్రీ సొంటిరెడ్డి పున్నారెడ్డి

కుత్బుల్లాపూర్ జూన్ 24(వాయిస్ టుడే): దాదాపుగా 5 లక్షల రూపాయల ఖర్చుతో పేద విద్యార్థి రమేష్ ది నిరుపేద కుటుంబం. ఇతను చదువులో బాగా రాణిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం. దీంతో ఇతను ఎంబిబిఎస్ చదవాలన ఆశను వదులుకునే ప్రయత్నంలో ఎస్పీఆర్ ట్రస్ట్ చైర్మన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి విషయం తెలుసుకొని రమేష్ ను ట్రస్టు ద్వారా దత్తత తీసుకున్నాడు. ఐదు సంవత్సరాల పాటు సొంత ఖర్చులతో చదివించడంతో ప్రస్తుతం అతను ఎంబిబిఎస్ పొంది, బుధవారం పున్నారెడ్డి ఆశీర్వాదం తీస్తున్నాడు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చదువుకునే పేద విద్యార్థికి తన వంతు సహాయంగా ప్రతి నెలలో వచ్చే వేతనంలో కొంత అందిస్తానని తెలిపారు.



## శ్రీ నల్ల పోచమ్మతల్లీ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావలసిందిగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్ జూన్ 24(వాయిస్ టుడే): 125 డివిజన్ గాజులరామారం పరిధిలోని దేవేందర్ నగర్ లో శ్రీ నల్ల పోచమ్మతల్లి కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావలసిందిగా ఎమ్మెల్సీ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంబిపూర్ రాజన్న మరియు 125 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డి.విజయ్ రామ్ రెడ్డి ఆహ్వానపత్రిక అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో సంధ్యా రెడ్డి సుగ్రీవుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నాము: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ జూన్ 24(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మహిళలు మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వానించారు.

## తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమీషన్‌ను కలిసిన శివసేన తెలంగాణ మేడ్చల్ ఇంచార్జి సురేష్ కుమార్




నాగారం, జూన్ 24:(వాయిస్ టుడే): శివసేన తెలంగాణ మేడ్చల్ ఇన్‌చార్జ్ అక్కల సురేష్ కుమార్ బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయాన్ని సందర్శించి, కమిషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ప్రస్తుత స్థితిగతులు, వాటి అమలు విధానం, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు మరియు ప్రజలకు అవి ఎంత మేరకు ఉపయోగపడుతున్నాయనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక సహాయం, సామాజిక భద్రత, హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అక్కల సురేష్ కుమార్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం రూపొందించిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పారదర్శకంగా చేరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రజలకు పథకాలపై మరింత అవగాహన కల్పించడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ మరియు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం శివసేన నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



## గద్వాల్ వీవర్స్ సొసైటీ శారీస్‌ను ప్రారంభించిన యాంకర్ సుమా కనకాల, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

హైదరాబాద్, జూన్ 24(:వాయిస్ టుడే) జూబ్లీహిల్స్ రోడ్ నెం.55లోని పెద్దమ్మ తల్లి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన గద్వాల్ వీవర్స్ సొసైటీ శారీ హౌస్ను ప్రముఖ యాంకర్ సుమా కనకాల, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, సంస్థ ప్రతినిధులు రామ్ గోపాల్ అగర్వాల్, ఆకాశ్ అగర్వాల్ కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమా కనకాల మాట్లాడుతూ, భారతీయ చేనేత కళా సంపదను పరిరక్షిస్తూ, నేత కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయాలనే లక్ష్యంతో 1986లో శ్రీ రామ్ గోపాల్ స్థాపించిన గద్వాల్ వీవర్స్ సొసైటీ గత నాలుగు దశాబ్దాలుగా విశేష సేవలు అందిస్తోందన్నారు. గద్వాల్ ప్రాంతానికి చెందిన సంప్రదాయ నేయకళను పరిరక్షించడమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ చేనేత సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

సాంప్రదాయంగా గద్వాల్ చీరలు స్వచ్ఛమైన పత్తితో మాత్రమే నేయబడేవని, కాలానుగుణంగా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సిల్క్-కాటన్ గద్వాల్ చీరలు, స్వచ్ఛమైన పట్టు గద్వాల్ చీరలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీంతో గద్వాల్ చీరల ప్రత్యేకతను కాపాడుకుంటూనే వైవిధ్యాన్ని వినియోగదారులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధి రామ్ గోపాల్ అగర్వాల్ మాట్లాడుతూ, చేనేత రంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో నేత కార్మికులకు స్థిరమైన ఆదాయం, గౌరవప్రదమైన జీవనోపాధి కల్పించడమే సొసైటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటు ధరల్లో అందించడం తమ ప్రత్యేకత అని చెప్పారు.

ఆకాశ్ అగర్వాల్ మాట్లాడుతూ, గద్వాల్ చీరల ప్రత్యేకతలో భాగంగా బాడీ, బోర్డర్‌లను వేర్వేరుగా నేసి సంప్రదాయ ఇంటర్‌లాకింగ్ పద్ధతిలో కలపడం, ఆలయాలు, ప్రకృతి, సాంస్కృతిక అంశాల స్ఫూర్తితో రూపొందించే జరీ డిజైన్లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఒక్కో చీర తయారీకి రోజులు, కొన్ని సందర్భాల్లో వారాల సమయం పట్టడం చేతిపనికి ఉన్న విలువను ప్రతిబింబిస్తుందని తెలిపారు. చేనేత కార్మికుల వద్ద నుంచే నేరుగా చీరలను సేకరించి, వీవర్ ప్రైస్కే వినియోగదారులకు అందిస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ, గద్వాల్ చేనేతతో పాటు దేశంలోని ప్రముఖ చేనేత సంప్రదాయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కాంచీపురం హ్యాండ్‌లూమ్ పట్టు చీరలు, పైఠాణీ, నారాయణపేట, పోచంపల్లి ఇకత్, ఉప్పాడ, జమ్దానీ, బనారసీ తదితర ప్రసిద్ధ చేనేత కలెక్షన్లు ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. తాను కూడా తన కుటుంబ సభ్యుల కోసం రెండు చీరలను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. గద్వాల్ వీవర్స్ సొసైటీ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే స్లో ఫ్యాషన్ భావనను ప్రోత్సహించడమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, మహిళా నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తోందని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభినందించారు.



# రాష్ట్రపతితో ముఖాముఖి...

## ఇఫ్లూ గిరిజన పరిశోధక విద్యార్థికి అరుదైన గౌరవం

సికింద్రాబాద్, జూన్ 24 (వాయిస్ టుడే ప్రతినిధి): హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ (ఇఫ్లూ)కు చెందిన గిరిజన పరిశోధక విద్యార్థి రామావత్ మునిలాల్‌కు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము తో ప్రత్యక్షంగా సమావేశమయ్యే అరుదైన అవకాశం లభించింది. ఈ ప్రత్యేక కార్యక్రమం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జన్ జాతీయ గరిమ ఉత్సవ్ -- బిర్సా లైవ్స్ ఇన్ న్యూ భారత్' వారోత్సవాల సందర్భంగా రాష్ట్రపతి భవన్ లో జరిగింది.

ఇఫ్లూ మీడియా అండ్ కమ్యూనికేషన్ విభాగంలో రెండో సంవత్సరం పీహెచ్‌డీ పరిశోధకుడైన మునిలాల్, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపికైన గిరిజన విద్యార్థులు, పరిశోధకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజన సమాజాల చరిత్ర, వారసత్వం, దేశాభివృద్ధిలో వారి పాత్రను గుర్తించి గౌరవించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాష్ట్రపతి భవన్ సందర్శనతో పాటు అక్కడి మ్యూజియాన్ని వీక్షించే అవకాశం కల్పించారు. భారత రాష్ట్రపతి వ్యవస్థ చరిత్ర, వివిధ రాష్ట్రపతులకు అందిన అరుదైన బహుమతులు, జ్ఞాపికలు, పురస్కారాల గురించి వారు తెలుసుకున్నారు. ఈ పర్యటన భారత ప్రజాస్వామ్య సంప్రదాయాలు, దౌత్య వారసత్వంపై అవగాహనను పెంపొందించిందని పాల్గొన్న విద్యార్థులు పేర్కొన్నారు. గిరిజన తండాలో జన్మించిన మునిలాల్‌కు ఈ అనుభవం జీవితంలో మరపురాని ఘట్టంగా నిలిచింది. తొలిసారిగా విమాన ప్రయాణం చేసి ఢిల్లీ చేరుకున్న ఆయన, దేశ నలుమూలల నుంచి వచ్చిన గిరిజన యువతతో మమేకమవడం, రాష్ట్రపతితో నేరుగా సంభాషించడం తన విద్యా జీవితంలో ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా మునిలాల్ మాట్లాడుతూ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థుల్లో ఉన్నత విద్య, నాయకత్వ లక్షణాలు, ప్రజాసేవ పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశం తనలో సమాజాభివృద్ధి కోసం మరింత కృషి చేయాలనే సంకల్పాన్ని బలోపేతం చేసిందని తెలిపారు. గిరిజన యువత పెద్ద లక్ష్యాలు పెట్టుకుని కృషి చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించవచ్చని ఈ కార్యక్రమం స్పష్టమైన సందేశాన్ని అందించిందని ఆయన పేర్కొన్నారు.

# నాన్‌స్టాప్ సింగింగ్‌తో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సింగర్ లావణ్య సంజయ్ గుప్తా





హైదరాబాద్ : జూన్ 24 ( వాయిస్ టుడే ): సోషియల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ , ప్రముఖ గాయని లావణ్య సంజయ్ గుప్తా హైదరాబాద్ లో ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. నాన్‌స్టాప్‌గా 4 భాషల పాటలు , 40 హీరోహీన్ల పాటలు 4 గంటల్లో ఆలపించి విశేష ప్రతిభ కనబరిచినందుకు ఆమెకు యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డ్స్ మరియు ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డు ప్రదానం చేశారు. విభిన్న భాషల్లో నిరాటంకంగా పాటలు పాడుతూ సంగీతంపై తనకున్న అంకితభావాన్ని, ప్రతిభను చాటుకున్న లావణ్య సంజయ్ గుప్తా ఈ ఘనతతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా సంగీతాభిమానులు, పలువురు ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇదే వేదికపై ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయి మార్కులు (468/470 ) సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థిని సాయి వర్షిణికి యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డ్స్ , ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డ్ , హ్యూమన్ రైట్స్ అచీవ్మెంట్ అవార్డులు ప్రధానం చేశారు.

## మూసపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



కూకట్ పల్లి, జూన్ 24(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసపేట్ సర్కిల్‌కు నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ మరియు ఐఎన్‌టీయూసీ నాయకుడు నరసింహా యాదవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి రాకను స్వాగతించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కొంతమందికే పరిమితమైన పథకాలు ఇప్పుడు ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి పేద కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే స్థానిక కాలనీలు, బస్తీలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎటువంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతమై ముఖ్యమంత్రి కి మంచి పేరు తీసుకురావాలని నాయకులు ఆకాంక్షించారు.



## యువతే పార్టీకి వెన్నుముక.. కష్టపడి పనిచేసిన వారిని పార్టీ తప్పకుండా గుర్తిస్తుంది: బండి రమేష్

కూకట్‌పల్లి, జూన్ 24(వాయిస్ టుడే): పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తే, కష్టపడిన నాయకులు మరియు కార్యకర్తలను గుర్తించి తగిన అవకాశాలు కల్పించే బాధ్యతను పార్టీ తీసుకుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ యువతను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ రాజకీయ పార్టీకి అయినా యువతే వెన్నెముకగా నిలుస్తుందని, పార్టీ అభివృద్ధితో పాటు దేశ అభివృద్ధిలోనూ యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు, గౌరవం తప్పకుండా లభిస్తాయని తెలిపారు. ప్రజా సమస్యలను పార్టీ ద్వారా పరిష్కరించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని, తద్వారా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తాను కూడా పార్టీ కోసం చేసిన పనితీరు కారణంగానే పార్టీ తనకు సముచిత స్థానం కల్పించిందని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బండి రమేష్, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేశంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. "ఆర్ఆర్ఆర్ (రమేష్--రేవంత్--రాహుల్)" నాయకత్వ స్ఫూర్తితో పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త నేటి నుంచే మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ భవ్య, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఇన్‌చార్జ్ రామ్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రమ్య, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక అజయ్‌తో పాటు పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాజీ కౌన్సిలర్ సి.హెచ్. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన జనసేన నాయకులు

కూకట్‌పల్లి, జూన్ 24(వాయిస్ టుడే): ఆకస్మికంగా మరణించిన మాజీ కౌన్సిలర్ సి. హెచ్. సత్యనారాయణ పార్థివ దేహానికి జనసేన పార్టీ నాయకులు నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు మరియు చేరికల పర్యవేక్షణ కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పార్థివ దేహం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ మనోధైర్యం కల్పించారు.

సి. హెచ్. సత్యనారాయణ ప్రజా సేవలో విశేషంగా కృషి చేశారని, వారి మరణం స్థానిక ప్రజలకు మరియు ప్రజా జీవితానికి తీరని లోటని ప్రేమకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, మండలి అనిల్, మోతీనగర్ జనసేన నాయకులు బడే విశ్వేశ్వరరావు, ప్రభు చైతన్య ఆరేటి, నల్లంపని రాజా, వలివేటి సురేష్, కాగితాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని శ్రీ సి. హెచ్. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని జనసేన నాయకులు ప్రార్థించారు.



## కేశవరావును కలిసి చర్చించిన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం చైర్మన్ డా చీమ శ్రీనివాస్

నాచారం (వాయిస్ టుడే):ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కే కేశవరావును కలిసి చర్చించిన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర కమిటీ నాయకులు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ప్రతి ఉద్యమ కారుడు స్వచ్ఛందంగా తమ వివరాలు ప్రభుత్వానికి ఇవ్వాలని నెల 26 తేదీన అధికారిగా వెబ్సైట్ ను ప్రారంభం చేస్తున్నాము అని ఎవరి సిఫారసు లేఖ అవసరం లేకుండా రాజకీయ ప్రమేయం లేకుండా ప్రతి ఉద్యమ కారుడు ను గుర్తిస్తాం అని తెలియ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం చైర్మన్ డా చీమ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాకాల రామచందర్, వైస్ చైర్మన్ గుండు దయానంద్, ఉపాధ్యక్షులు R K భూపాల్, ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రీమ్ వ్యాలీలో లోతట్టు ప్రాంతాల పరిశీలన

కుత్బుల్లాపూర్ జూన్ 24(వాయిస్ టుడే): మల్లంపేట్ లోని డ్రీమ్ వ్యాలీ రోడ్ నెంబర్ 1 నందు వర్షపు నీరు నిలిచే (వాటర్ లాగింగ్) లోతట్టు ప్రాంతాలను డిప్యూటీ కమిషనర్ సందర్శించారు. స్థానిక ప్రజలు సమర్పించిన వినతి పత్రాలను పరిశీలించిన ఆయన, రాబోయే వానాకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వాటర్ లాగింగ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని అసిస్టెంట్ ఇంజనీర్ (మెయింటినెన్స్) బి. సురేందర్ నాయక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డిలను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ వ్యాలీ కాలనీ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌లో కొత్త వాష్ రూమ్‌ల పరిశీలన: మల్లంపేట్ లోని ప్రభుత్వ హైస్కూల్ నందు కొత్తగా నిర్మాణం చేపడుతున్న వాష్ రూమ్‌ల పనులను డిప్యూటీ కమిషనర్ నిశితంగా పరిశీలించారు. పనుల నాణ్యతపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెయింటినెన్స్) సురేందర్ నాయక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు. దీప్తి సువర్ణ సంపద వెంచర్‌లో తనిఖ ప్రతిపాదనలకు ఆదేశం: గాగిల్లాపూర్ లోని 'దీప్తి సువర్ణ సంపద వెంచర్' నిర్వాహకులు తమ వెంచర్‌కు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు మరియు క్లీనింగ్ తదితర సౌకర్యాలను కల్పించాల్సిందిగా డిప్యూటీ కమిషనర్ రిక్వెస్ట్ లెటర్ సమర్పించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ సదరు వెంచర్‌ను సందర్శించారు. అక్కడ మౌలిక వసతుల కల్పనకు సంబంధించి నివేదిక, ప్రపోజల్స్ సిద్ధం చేయాలని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డిని, అసిస్టెంట్ ఇంజనీర్ (మెయింటినెన్స్) సురేందర్ నాయక్‌ను ఆదేశించారు.



## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెట్ల కొమ్మల తొలగింపు


జూబ్లీహిల్స్ 24 జూన్( వాయిస్ టుడే )-- శ్రీనగర్ కాలనీ వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలి షార్ట్‌సర్క్యూట్‌లు, విద్యుత్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శ్రీనగర్ కాలనీలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు పర్యవేక్షించారు. వర్షాల కారణంగా చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు సంభవించకుండా, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ వైర్లకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మల విషయమై వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ నాయకులు కిరణ్ యాదవ్, మనోజ్ యాదవ్, చిన్న, జి. సాయి యాదవ్, చిన్న యాదవ్, మహేష్ ముదిరాజ్, కొమ్ము బాబు తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు. స్థానిక ప్రజలు ఈ ముందస్తు చర్యలను అభినందించారు.



## తెలంగాణ ప్రభుత్వం నుండి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ.1 కోటి నిధులు మంజూరు

కుత్బుల్లాపూర్ జూన్ 24(వాయిస్ టుడే): తెలంగాణ ప్రభుత్వం నుండి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ. 1 కోటి నిధులు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో మంజూరు కావడం పట్ల, బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు కుర్మ సంఘ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కుర్మ సంఘ అధ్యక్షులు బట్ట బాలకృష్ణ, సూరారం విలేజ్ చైర్మన్ బట్ట నర్సింహా, ఆలయ అధ్యక్షులు బాలయ్య, పెంటయ్య, సెల్వియోజి సత్తయ్య, చిన్న సత్తయ్య, బాలరాజ్, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ



హైదరాబాద్, జూన్ 24: స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణ పథకం ద్వారా 36వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా 100కు పైగా వివిధ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ. వెంకట్ రెడ్డి తెలిపారు. ఆన్ లైన్ ఈ లెర్నింగ్ ద్వారా కోర్స్ పూర్తిచేసిన యువతకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంచే నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేటి సమాజంలో పేద, మధ్యతరగతి విద్యార్థిని విదార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు అత్యధిక జీత భత్యాలు, ఉద్యోగ అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో ఆన్లైన్ శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కంప్యూటర్ సాఫ్ట్వేర్ శిక్షణ రంగంలో 34 సంవత్సరాల అనుభవం గల పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి 100 కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా ఆన్ లైన్ ఈ-లెర్నింగ్ ద్వారా శిక్షణను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణా పథకం ద్వారా రూ. 1,50,000 వరకు కోర్స్ ఫీజులు గల వివిధ లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా నేర్చుకొని సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పొందాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థినీ విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు జూలై 31వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.pacecom-puters.org వివరాలకు ఫోన్: 9505800047



## SIR కిట్ బాక్స్ డిస్ట్రిబ్యూషన్ టు చేసిన డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్

నాచారం (వాయిస్ టుడే):నాచారం సర్కిల్ నెంబర్8లో SIR కిట్ బాక్స్ డిస్ట్రిబ్యూషన్ టును సిబ్బందికి చేసిన డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్, అశోక్, సదానంద్, బిఎల్వోస్..



## త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి అభినందన సత్కారం

హైదరాబాద్, జూన్ 24: త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి తన పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ సీనియర్ నేత వై. కృష్ణ, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు ల నేతృత్వంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను బహుకరించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ప్రయోజన పథకాలు, సామాజిక అభివృద్ధి, తదితర అంశాలపై వారు గవర్నర్ తో చర్చించారు.



## డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్‌కు టీఎన్జీవోస్ నేతల సత్కారం

హైదరాబాద్, జూన్ 24: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సి.వి. ఆనంద్ ఐపీఎస్ ను టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ ప్రెసిడెంట్, బీటీఎన్జీవోస్ (గచ్చిబౌలి) హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సుమన్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి, ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.




## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సరికొత్త ప్రపంచ రికార్డు ప్రయత్నం పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, జూన్ 24: ఖైరతాబాద్ అడిషనల్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న జరగనున్న సరికొత్త ప్రపంచ రికార్డు ప్రయత్నానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఖైరతాబాద్ ఏడీసీపీ ఆనంద్ అంద చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జూన్ 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యువతలో అవగాహన కల్పించేందుకు జివిఆర్ కరాటే అకాడమీ చేపడుతున్న ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నం అభినందనీయమని అన్నారు. ప్రస్తుతం యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ వంటి సానుకూల కార్యక్రమాల ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించడం అవసరమని పేర్కొన్నారు. జూన్ 26వ తేదీ ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్ నారాయణగూడ లోని జివిఆర్ కరాటే అకాడమీలో డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో కేవలం 26 సెకన్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను హ్యాండ్ చాప్ స్ట్రైక్ ద్వారా పగలగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఈ వినూత్న ప్రదర్శన వేగం, కచ్చితత్వం, ధైర్యసాహసాలు మరియు కరాటే నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నంలో విద్యార్థులు భార్గవ్ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ పాల్గొననున్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 26న జరిగే ప్రపంచ రికార్డు ప్రయత్నానికి అధికారిక పరిశీలకుడిగా బింగి నరేందర్ గౌడ్ హాజరై రికార్డు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.





# వేములవాడలో అల్ఫోర్స్ టెక్నో స్కూల్ నూతన భవనం ప్రారంభం

### కార్పొరేట్ స్థాయి విద్యా అవకాశాలు కల్పించనున్న నూతన క్యాంపస్

వేములవాడ (రాజన్న సిరిసిల్ల జిల్లా), జూన్ 25 -- వాయిస్ టుడే: వేములవాడ పట్టణ కేంద్రంలో అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఆధునిక భవనంలో అల్ఫోర్స్ టెక్నో స్కూల్ నూతన క్యాంపస్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ భవనాన్ని కొండ దేవయ్య పటేల్ విజన్‌తో, వారి కుమారులు కొండ కృష్ణ, కొండ నాగేంద్ర బాబు పటేల్ (అమెరికా) ఎడ్యుకేషనల్ హబ్ లక్ష్యంతో నిర్మించారు. తమ తాత కొండ రాములు పటేల్ కోరిక మేరకు విద్యా అభివృద్ధి కోసం ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు అని అన్నారు. మొదట ఈ భవనాన్ని గురుకుల జ్యోతిరావు పూలే బీసీ పాఠశాల మరియు మైనార్టీ పాఠశాలకు ఆరు సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం జరిగింది. అనంతరం అల్ఫోర్స్ టెక్నో స్కూల్స్ అధినేత, చైర్మన్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో లీజు కింద కొనసాగిస్తూ నాఖ+ నుండి 8వ తరగతి వరకు ఏసీ క్లాస్‌రూమ్స్, ఆధునిక సౌకర్యాలతో క్యాంపస్‌ను అభివృద్ధి చేశారు. వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ఫోర్స్ టెక్నో స్కూల్ చైర్మన్ నరేందర్ రెడ్డి వేములవాడలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్పొరేట్ స్థాయి విద్యను స్థానికంగా అందించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన భవిష్యత్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.



ఇప్పటివరకు సుమారు 600 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అల్ఫోర్స్ టెక్నో స్కూల్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా 60కి పైగా బ్రాంచీల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విద్యా ప్రమాణాల్లో ఎప్పుడూ రాజీ పడలేదని చెప్పారు. వేములవాడ బ్రాంచ్‌లో కూడా విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యతో పాటు భవిష్యత్ పోటీ పరీక్షలకు అవసరమైన బలమైన పునాది అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్లం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పాత్రికేయ మిత్రులు, అలాగే సుమారు 600 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కొండ దేవయ్య పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.








## జీర్ణాశయ శస్త్రచికిత్సల్లో ఆధునిక సాంకేతికతలు

### రోగులకు మరింత సురక్షితమైన, వేగవంతమైన చికిత్స

### సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. ప్రసాద్ బాబు




కరీంనగర్ (వాయిస్ టుడే) : జీర్ణాశయ (గ్యాస్ట్రో ఇంటెస్టినల్) వ్యాధుల చికిత్సలో ఆధునిక సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయని యశోద సికింద్రాబాద్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. ప్రసాద్ బాబు టి.ఎల్.వి.డి. అన్నారు. లాపరోస్కోపిక్, రోబోటిక్ శస్త్రచికిత్సల ద్వారా రోగులకు మరింత సురక్షితమైన, ఖచ్చితమైన, వేగవంతమైన చికిత్స అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. బుధవారం నగరంలోని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గతంలో పెద్ద కోతలతో నిర్వహించే సంప్రదాయ శస్త్రచికిత్సలకు బదులుగా ప్రస్తుతం మినిమల్లి ఇన్వేసివ్ (చిన్న రంధ్రాల) విధానాలు అందుబాటులోకి రావడంతో రోగులు వేగంగా కోలుకుంటున్నారని చెప్పారు. అన్నవాహిక, కడుపు, కాలేయం, క్లోమగ్రంధి, పిత్తాశయం, పెద్దపేగు, పురీషనాళ క్యాన్సర్లు, సంక్లిష్ట హెర్నియాలు, స్థూలకాయం, రిఫ్లక్స్ వ్యాధుల చికిత్సలో ఈ సాంకేతికతలు విశేష ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. లాపరోస్కోపిక్ విధానంలో హైడెఫినిషన్ కెమెరాల సహాయంతో ఆపరేషన్ నిర్వహిస్తారని, దీనివల్ల నొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గడంతో పాటు ఆసుపత్రిలో తక్కువ రోజులు ఉంటే సరిపోతుందన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా త్రిమితీయ (3డీ) దృశ్యాలు, అత్యంత సూక్ష్మ కదలికల నియంత్రణ వీలవుతుందని, సంక్లిష్ట ప్రాంతాల్లోని ఆపరేషన్లకు ఇది ఎంతో ఉపయోగకరమని వివరించారు. జీర్ణాశయ సమస్యలను ముందుగానే గుర్తించి నిపుణులను సంప్రదిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచించారు. గ్యాస్ట్రోఎంటరాలజీ డాక్టర్ జయదీప్ మాట్లాడుతూ.. సమాజంలో ఆందోళన వ్యక్తం చేశారు. కొందరికి జీవనశైలి మార్పుల వల్ల ఉబకాయం తగ్గించుకోవచ్చు అన్నారు. మరికొందరికి సర్జరీ తప్పనిసరి అని ఆ సర్జరీ ఇప్పుడు ఆంకేతికంగా రోబోటిక్ సర్జరీ ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చికిత్స అందుబాటులోకి వచ్చిందన్నారు. ఊబకాయం వల్ల ఇతర అవయవాలపై ప్రభావం పడుతుందని దువ్వకాయలు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ హెడ్ నరేంద్ర మోరా, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.



## కరీంనగర్ జిల్లాలో కారు గుర్తు సునామీ ఖాయం: కేటీఆర్

కరీంనగర్ జిల్లా అనాదిగా బీఆర్ఎస్‌కు కంచుకోటగా నిలిచిందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా జిల్లాలో కారు గుర్తుదే విజయమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పార్టీ బలోపేతం, సమకాలీన రాజకీయాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, మోసపూరిత ప్రచారాల కారణంగా కొన్ని స్థానాలు కోల్పోయామని, అయితే రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. ప్రస్తుతం ప్రజలు తిరిగి బీఆర్ఎస్, పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేలో కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం కనిపిస్తోందని, రానున్న ఎన్నికల్లో కారు గుర్తు మరోసారి సునామీ సృష్టించబోతుందని కేటీఆర్ తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు, బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, క్షేత్రస్థాయి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సింగరేణి అంశంలో కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజలకు వివరించాలని, కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ రైతుల సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ కార్యకర్తలే బీఆర్ఎస్ బలమని పేర్కొన్న కేటీఆర్, ప్రతి కార్యకర్తను గౌరవిస్తూ బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు చేరువ కావాలని కూడా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# సామాన్యులపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం

## సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



తొర్రూరు, జూన్ 24 వాయిస్ టుడే: కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన తర్వాత అన్ని రకాల ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపిందని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి విమర్శించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విజయ సారథి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడలేదన్నారు. అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, కేంద్రంలో బలాన్ని పెంచుకోవడానికి ప్రధాని నరేంద్ర మోడీ పార్టీలను చేయుచున్నాడని విమర్శించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. హైవే రోడ్లలో నడిచే వాహనాలపై భారం వేస్తున్నారని, పన్నుల రూపంతో పాటు రోడ్లపై దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. దీంతో ఆర్థిక వ్యవస్థ ఉప కూలిపోయిందని, మత, కులం, దేవుళ్ళ పేరుతో బిజెపి రాజకీయం చేస్తుందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పేదలు వేసుకున్న గుడిసెలను ఉల్చివేయడం సరికాదన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలో వందలాది ఎకరాలు ఆక్రమించుకున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజావ్యతిరేక పాలనపై విశ్రాంత పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జూలై 5, 6, 7 తేదీలలో తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే భూషణ్నేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస రావులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు ఓమా బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శులు ఘనపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్ కుమార్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, కోటగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## శాంతి భద్రతల పర్యవేక్షణకై నూతన సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన హుజూర్ నగర్ సిఐ చరమంద రాజు

హుజూర్ నగర్, జూన్,24 (వాయిస్ టుడే ప్రతినిధి) : హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపలసింగారం గ్రామంలో బోడ్రాయి పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణకై నూతనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు హుజూర్ నగర్ సిఐ చరమంద రాజు తెలిపారు. బొడ్రాయి ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు. ప్రజల రక్షణ, నేరాల నియంత్రణ కొరకు వ్యూహాత్మక ప్రాంతాలలో సీసీ కెమెరాలు అమర్చామని పండుగను భక్తులు, గ్రామస్థులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జాతీయ బిసి చైతన్య సమితి జిల్లా మహిళ అధ్యక్షురాలుగా సూరోజు జ్యోతి నియామకం



హుజూర్ నగర్, జూన్, 24 (వాయిస్ టుడే ప్రతినిధి): జాతీయ బీసీ చైతన్య సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా హుజూర్ నగర్ పట్టణానికి చెందిన సూరోజు జ్యోతిని నియమిస్తు ఆ సంఘం జాతీయ బిసి చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ నరసింహచారి ఆమెకు నియామక పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలని రాబోయే ఎన్నికల్లో మహిళలకు, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అసెంబ్లీ బడ్జెట్లో మహిళల బిల్లు ప్రకటించాలని అలాగే కేంద్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక హోదా కల్పించాలని చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని పురుషులతోపాటు మహిళలకు ప్రత్యేక హోదా కల్పించాలని అన్నారు అదేవిధంగ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షురాలుగా నియమించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

## ఆర్థిక సహాయం



రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ మండలం వడ్డే లింగ పూర్ కి చెందిన రాజేందర్ దుబాయ్ కి వలస వెల్లి అక్కడ గుండెపోటు తో మరణించారు ఆయన కుటుంబాన్ని పరామర్శించిన జిడబ్ల్యూఎస్ దుబాయ్ దళిత శక్తి ప్రోగ్రాం అధ్యక్షులు, తెలుగు డ్రైవర్స్ హెల్పింగ్ గ్రూప్ అడ్మిన్ కిరణ్ కుమార్ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రేమ్ బిసి, ఎస్సి ఎస్.టి జేఏసీ నాయకులు తిరుపతి,బాబులు గ్రామస్తులు మరియు యువత సేకరించిన 58 వేల రూపాయలు నగదు ను రాజేందర్ భార్యకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత నిరుపేద కుటుంబనికి రాష్ట్రప్రభుత్వం 5 లక్షల ఎక్స్ గ్రెసియా చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాలేపు జీవన్ ఉపసర్పంచ్ భూక్య శంకర్,భూపతి పూర్ వార్డ్ సభ్యులు రాము, ఈదుల లక్ష్మణ్ కుమార్,నాగుల రాజేశం, పాలేపు సురేష్ పాల్గొన్నారు.



## లింగన్న కుటుంబానికి పరామర్శ

రాయికల్ ( వాయిస్ టుడే): రాయికల్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మరియు సీనియర్ నాయకులు ఏనుగందుల లింగం గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రగాఢ సానుభూతి అన్ని విధాలుగా వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్, వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, రాయికల్ మండల ఽ పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్ ,ఎలగేటి అనిల్, తోట హరీష్, నాయకులు మర్రిపెల్లి నారాయణ గౌడ్, కోయ్యాడి మహిపాల్ ,రుక్కు భాయ్,వొళ్ళాల గంగాధర్, స్వామిరెడ్డి,పులి మల్లేశం గౌడ్,మరియు బి.ఆర్ .యస్ నాయకులు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

### కాంగ్రెస్‌పై ఎంపీ వద్దిరాజు విమర్శలు



ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బుధవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు ముఖ్య అతిథిగా, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సహా పలువురు నాయకులు హాజరయ్యారు. మాజీ లోక్‌సభ సభ్యులు నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు జిల్లాకు గణనీయమైన అభివృద్ధి తీసుకురాలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమీ జరగలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, బీసీలకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, మళ్లీ ఆయన ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీ తెలిపారు. అలాగే ఓటరు నమోదు, పార్టీ బలోపేతం, యువతను ఓటర్లుగా చేర్చడం, గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు క్రమశిక్షణతో పనిచేయాలని ఆయన సూచించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన గోగులమూడి రాజు




కృష్ణా జిల్లా-(వాయిస్ టుడే) విజయవాడ: విజయవాడ రూరల్ నిడమానూరు బుధవారం జరిగిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోగులుమూడి రాము సోదరుడు గోగులమూడి రాజేశ్వరరావు వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్న మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు నూతన వధూవరులు గోగులమూడి రాజేశ్వరరావు, మౌనికలకు శుభ ఆశీస్సులు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షులు సరిహద్దు ఆంధోని, బేతాళ అజయ్ బాబు,సురేష్ పాల్గొన్నారు.



## భూక్య కమలమ్మకు ఘన నివాళులు అర్పించిన బాదావత్ బాలాజీ

### కస్నాతండాలో దశదిన కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించిన వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు

వైరా (వాయిస్ టుడే ప్రతినిధి) : ఖమ్మం జిల్లా సీపీఐ(ఎం) నాయకులు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం గారి తల్లి భూక్య కమలమ్మ గారి దశదిన కార్యక్రమం మంగళవారం ఖమ్మం జిల్లా కస్నాతండాలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ -మాజీ జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి సతీసమేతంగా హాజరై కమలమ్మ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరభద్రం గారు మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివంగత కమలమ్మ గారి సేవలను స్మరించుకున్న బాలాజీ గారు, కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కమలమ్మ గారి మరణం కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాదావత్ బాలాజీ గారు మాట్లాడుతూ, “భూక్య కమలమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఈ విషాద సమయంలో వీరభద్రం గారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను” అని అన్నారు. దశదిన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కమలమ్మ గారికి నివాళులర్పించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడింది. దివంగత కమలమ్మ గారి స్మృతులను గుర్తు చేసుకుంటూ పలువురు ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. కార్యక్రమం అనంతరం కుటుంబ సభ్యులు హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన బాదావత్ బాలాజీ

### ఉప్పరగూడెంలో జరిగిన వివాహ మహోత్సవానికి సతీసమేతంగా హాజరు

వైరా (వాయిస్ టుడే ప్రతినిధి) : ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన భూక్య శ్రీను - మంగ దంపతుల కుమార్తె కళ్యాణి మరియు సాయి నాయక్‌ల వివాహ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు వైరా నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ మాజీ జెడ్పీటీసీ బుజ్జి సతీసమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలో పాల్గొన్న బాలాజీ వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందమయం, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలు, సంప్రదాయ విలువలను కాపాడుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులను పరామర్శించిన బాలాజీ వివాహ వేడుకను విజయవంతంగా నిర్వహించిన కుటుంబ పెద్దలను అభినందించారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రులతో కలిసి కొంతసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. వివాహ కార్యక్రమంలో భూక్య నరసింహారావు, మంగ, గణేష్, పార్వతి, లింగమ్మ, సంతోష్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు ఆశీర్వాదాలు అందించారు. బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో వివాహ వేడుక సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.



## పేదల గుండెల్లో నిలిచిపోయే సంక్షేమం... ఇందిరమ్మ ఇళ్లు

### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. సిద్దం.ఉజ్వల్ రెడ్డి

ఝరాసంగం, జూన్ 24 (వాయిస్ టుడే): జహీరాబాద్ మొగడంపల్లీ మండలంలోని ఇప్పేపల్లీ గ్రామం నరేష్.మరియు మన్నాపూర్ గ్రామం రేణుక నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. సిద్దం.ఉజ్వల్ రెడ్డి.... లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారితో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు..అనంతరం లబ్ధిదారులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్దం.ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ... పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.. ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా స్థిరమైన నివాసం కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు..

జహీరాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని,ప్రతీ అర్హత కలిగిన పేద కుటుంబానికి ఇల్లు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్,మాజీ సొసైటీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి,మాజీ యం.పి.పి గుండారెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, మొగడంపల్లీ మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోపాల్,సర్పంచ్ లు రుక్కి బాయి హరిసింగ్ బ్రహ్మానంద రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,అశ్విన్ పాటిల్,ఎస్టీ సెల్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ బాణోత్ రాజు నాయక్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు..

వాయిస్
హైదరాబాద్
గురువారం 25 జూన్ 2026

# ప్రధాన మంత్రి స్వనిధి పథకం గడువు 2030 వరకు పొడిగింపు

**చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి**

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, జూన్ 24(వాయిస్ టుడే): తెల్లవారుజామున కూరగాయలు విక్రయించే వారి నుండి రాత్రివేళ టిఫిన్ బండ్లు నిర్వహించే వారివరకు ప్రజల రోజువారీ అవసరాలను తీర్చేందుకు శ్రమిస్తున్న వీధి వ్యాపారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి స్వనిధి పథకం గడువును 2030 మార్చి 31 వరకుపొడిగించడం అభినందనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా స్వయం ఉపాధిని బలోపేతం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత విస్తరించిందన్నారు.ఎలాంటి గ్యారెంటీ అవసరం లేకుండా బ్యాంకుల ద్వారా అందించే రుణాల పరిమితిని కూడా పెంచినట్లు తెలిపారు.మొదటిసారి రుణం పొందే లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.10,000 అందించగా, ప్రస్తుతం దానిని రూ.15,000కు పెంచారని చెప్పారు.మొదటి రుణాన్ని సకాలంలో చెల్లించిన వారికి రెండో విడతలో రూ.20,000 స్థానంలో రూ.25,000 రుణం అందజేస్తారని వివరించారు.రెండో రుణాన్ని కూడా క్రమం తప్పకుండా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50,000 వరకు రుణం మంజూరు చేసి వ్యాపార విస్తరణకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు.అంతేకాకుండా రెండో రుణాన్ని సక్రమంగా చెల్లించిన వారికి రూ.10,000 నుంచి రూ.30,000 వరకు పరిమితి గల యూపీఐ క్రెడిట్ కార్డును కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 75.5 లక్షల మంది వీధి వ్యాపారులు లబ్ధి పొందారని, సుమారు రూ.17,800 కోట్ల రుణాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. వీరిలో సగానికి పైగా మహిళలు ఉండటం విశేషమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఈ పథకం అమలులో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని,రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7.68 లక్షల రుణాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. వీరిలో 4.44 లక్షల మంది మొదటి విడత, 2.35 లక్షల మంది రెండో విడత, 88 వేల మందికి పైగా మూడో విడత రుణాలు పొందుతూ తమ వ్యాపారాలను విజయవంతంగా అభివృద్ధి చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఈ అద్భుత అవకాశాన్ని కరీంనగర్ నగరంలోని ప్రతి చిరు వ్యాపారి సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం,మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,అడిషనల్ కమిషనర్ సువార్త, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



## సత్తుపల్లిలో బీఆర్ఎస్ నేతల ఇష్టాగోష్టి

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ లోక్‌సభ సభ్యుడు నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, తక్కళ్లపల్లి రవీందర్ రావు ఇష్టాగోష్టిగా చర్చించుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ పలు రాజకీయ, పార్టీ వ్యవహారాలకు సంబంధించిన అంశాలను నాయకులతో పంచుకుంటుండగా, ఇతర నేతలు ఆయన మాటలను ఆసక్తిగా ఆలకించారు. సమావేశం అనంతరం జరిగిన ఈ అనౌపచారిక చర్చలో రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సాగిన ఈ ఇష్టాగోష్టి సమావేశం అక్కడున్న కార్యకర్తలను ఆకట్టుకుంది.



## మద్యం సేవించి వాహనాలు నడపకండి - ప్రమాదాల బారిన పడకండి

**జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్**

జమ్మికుంట, జూన్ 24 (వాయిస్ టుడే): బుధవారం రోజున జమ్మికుంట పట్టణ శివారులో పట్టణ సి ఐ రామక్రిష్ణ గౌడ్ ఆధ్వర్యం లో పోలీసు బృందం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై కూడా మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలను నివారించాలని పట్టణ సీఐ విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఎస్సై రవి, ఏఎస్ఐ సంపత్ పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సాధికారత తెలుగు అసోసియేషన్ హుజూరాబాద్ మండల కోఆర్డినేటర్‌గా చెల్పూర్ సర్పంచ్ వంతడుపుల కస్తూరి



హుజురాబాద్ జూన్ 24 (వాయిస్ టుడే): మహిళల అభివృద్ధే ధ్యేయంగా స్థాపించబడిన మహిళా ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ హుజూరాబాద్ మండల కోఆర్డినేటర్‌గా చెల్పూర్ గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరిని ఎంపిక చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని జూబ్లీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమెకు బాధ్యతలు అప్పగించారు. గత నలభై సంవత్సరాలుగా హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో పేద, వెనుకబడిన మహిళల అభివృద్ధి లక్ష్యంగా ఈ సంస్థ సేవలు అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, లైబ్రరీల నిర్మాణంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళల సాధికారతకు కృషి చేస్తోంది. రాష్ట్రంలోని మహిళలు విద్య, వైద్యం, ఆర్థిక, సామాజిక, సేవా రంగాల్లో మరింత పురోగతి సాధించాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, శిక్షణ మరియు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. మహిళల అభివృద్ధి కోసం చక్కటి వేదికను ఏర్పాటు చేసిన హనుమండ్ల ఝాన్సీ రెడ్డిని వారు అభినందించారు. మహిళల అభ్యున్నతి కోసం కోఆర్డినేటర్లు సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా వంతడుపుల కస్తూరి మాట్లాడుతూ, హుజూరాబాద్ మండలంలో ఆర్థిక ఇబ్బందులతో చదువుకుంటున్న ప్రతి అమ్మాయికి తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. అలాగే మహిళలు అన్ని రంగాల్లో ఎదగడానికి కృషి చేస్తానని, మహిళలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా నిలుస్తానని చెప్పారు. మండల కోఆర్డినేటర్‌గా ఎంపికైన వంతడుపుల కస్తూరిని మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## పట్టణ శివారులో గంజాయి పట్టివేత - పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

**పట్టణ సి ఐ టి.కరుణాకర్**

హుజూరాబాద్ జూన్ 24 (వాయిస్ టుడే): హుజురాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ లో పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న సమయం లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సి ఐ కరుణాకర్ వెల్లడించారు. సి ఐ తెలిపిన వివరాల ప్రకారం పరకాల క్రాస్ రోడ్ లో పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న సమయం లో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడం తో వారిని తనిఖీ చేయగా వారి దగ్గర గంజాయి ఉందని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా హుజురాబాద్ పట్టణానికి చెందిన టేకుమట్ల రాజేష్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట గ్రామానికి చెందిన రబ్బానీ, షేక్ షారుక్ గా నిర్ధారించి వారి వద్ద నుండి 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు ఫైల్ చేశారు. మహారాష్ట్ర నుండి ఇక్కడకి గంజాయిని తీసుకు వచ్చి విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, దర్యాప్తు ఇంకా కొనసాగుతుందని సి ఐ కరుణాకర్ వెల్లడించారు.



## దయచేసిడ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకండి

**కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**

కరీంనగర్, జూన్ 24(వాయిస్ టుడే): పట్టణ ప్రజలు,ముఖ్యంగా 50వ డివిజన్ (జ్యోతి నగర్) వాసులు , డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడం మానుకోవాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు విజ్ఞప్తి చేశారు.ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయడం వల్ల పూర్తి గా డ్రైనేజీ వ్యవస్థ స్తంభించిపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు రోజుల్లో జ్యోతి నగర్ డ్రైనేజీల నుండి ఇప్పటివరకు 5 ట్రాక్టర్ల చెత్తాచెదారంను తొలగించడం జరిగిందన్నారు.వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేసే పనులను ముమ్మరం చేసినట్లు కార్పొరేటర్ ప్రవీణ్ రావు తెలిపారు. ఈ క్రమంలో జ్యోతి నగర్, కెమిస్ట్రీ భవన్ రోడ్డు, పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీలను పరిశీలించగా,ప్లాస్టిక్ వ్యర్థాలతో, చెత్తా చెదారంతో నీరు ప్రవహించకుండా పూర్తిగా అడ్డుపడిందనే విషయాన్ని గుర్తించి, ప్రధానంగా డ్రైనేజీల్లో భారీ ఎత్తున పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలోనీ డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు రోడ్ల మీదికి వచ్చే ప్రమాదం ఉందన్నారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన ఈ చెత్త, వ్యర్థాల వల్ల క్రిమి కీటకాలు దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని,అపరిశుభ్రత వల్ల వచ్చే రోగాలు మన కుటుంబాలనే ఇబ్బంది పెడతాయన్నారు.దయచేసి ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలనీ,చెత్తను డ్రైనేజీలలో వేయకుండా, మున్సిపాలిటీ కేటాయించిన స్థలంలో(డస్ట్ బిన్) వేయాలని,చెత్త చెదారం ను ట్రాక్టర్లకు అందించాలని, పరిశుభ్రమైన పరిసరాలు, వాతావరణం కోసం సౌకర్యవంతమైన జీవనానికి డివిజన్ ప్రజలు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కార్పొరేటర్ ప్రవీణ్ రావు కోరారు.



## జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య ఇవ్వాలని కలెక్టర్ కు వినతి

కరీంనగర్, జూన్ 24(వాయిస్ టుడే): జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీని ప్రైవేట్ పాఠశాలలు ఇవ్వడం లేదు వెంటనే 100% రాయితీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల పిల్లలకు పూర్తి ఉచిత విద్యను అందించాలని ఆదేశాలు జారీ చేయగా దానికి అనుగుణంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు ఇయ్యగా ప్రైవేట్ పాఠశాలలు పూర్తిస్థాయిలో ఫీజు మాఫీ చేయడం సాధ్యం కాదని 10 నుండి 20 శాతం మాత్రమే మాఫీ చేస్తామని చెప్పడం జరిగింది సమాజానికి ఉపయోగపడే జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య ఎంతైనా అవసరం ఉంది కావున పూర్తిస్థాయి ఫీజులు మాఫీ చేసే విధంగా తమరు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్ ,బీసీ యువజన సంఘం నాయకులు మాదాసు సంజీబీసీ విద్యార్థి సంఘం నాయకులు కుటుంబ ఆదర్శ్ పాల్గొన్నారు.




## పిల్లలను లెడ్ ప్రభావం నుండి రక్షించండి

**అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

కరీంనగర్, జూన్ 24(వాయిస్ టుడే): జీవితంలో మనకు తెలియకుండానే లెడ్( సీసం) మన శరీరంలోకి ప్రవేశిస్తుందని దాని నుండి ముఖ్యంగా పిల్లలను రక్షించాల్సిన బాధ్యత మనందరి పై ఉందని డా. వెంకటేష్ తుప్పిల్,మహేష్ నంద్యాల్, సౌమ్య నంద్యాల్ అన్నారు.ఎన్విజన్ ఇంటర్ నేషనల్ మరియు ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ ఇండియా సౌజన్యంతో మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం అనంతరం అల్ఫోర్స్ స్కూల్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ లెడ్ ప్రభావ స్థాయిని అంచనా వేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి బ్లడ్ లెడ్ లెవల్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని దాన్ని బట్టి ఈ ప్రాంతంలో ఏ మేరకు ప్రభావం ఉందో తెలిసిపోతుందని అన్నారు.లెడ్ ప్రభావం వల్ల రక్త హీనత,మేధస్సు మరియు నేర్చుకునే సామర్థ్యం తగ్గడం,జ్ఞాపక శక్తి మరియు ఏకాగ్రత లోపించడం,మూత్రపిండాలు దెబ్బతినడం,కండరాలు మరియు కీళ్ల సమస్యలు,పిల్లల్లో ప్రవర్తనా మరియు అభివృద్ధి లోపాలు,గర్భంలోని శిశువుకు తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు వంటివి జరుగుతాయని తెలిపారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గోర్లకు పెట్టుకొనే నెల్ పాలిష్ ద్వారా వెంట్రుకలకు వేసుకునే హెయిర్ డై ద్వారా పేపర్ ప్లేట్ల ద్వారా ఇలా అనేక విధాలుగా లెడ్ మన శరీరంలోకి ప్రవేశిస్తుందని ముఖ్యంగా 15 సంవత్సరాలలోపు పిల్లలలో ఎక్కువగా ప్రభావం చూపుతుందని అన్నారు.అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ హరిప్రసాద్,డిఈవో ప్రశాంత్ రెడ్డి,హెడ్ మాస్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.




## డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేద్దాం - డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**ఇల్లందుకుంట ఎస్సై కాంత్రికుమార్**

ఇల్లందుకుంట, జూన్ 24 (వాయిస్ టుడే): బుధవారం ఇల్లందకుంట మండల కేంద్రంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం ఎస్సై ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కాంత్రికుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు,ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని, అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని సూచించార. యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన 1908 ద్వారా పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 2 కోట్ల సుడా నిధులతో హెలిప్యాడ్, కలెక్టరేట్ ఉత్తరం మెయిన్ రోడ్డు, గార్డెన్ల నిర్మాణానికి శంకుస్థాపన

కరీంనగర్, జూన్ 24(వాయిస్ టుడే): కలెక్టరేట్ వెనుక గల పాత హెలిప్యాడ్ పార్క్ లో నూతనంగా హెలిప్యాడ్ నిర్మాణానికి మరియు నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ కు ఉత్తరం వైపు సిసి రోడ్డు నిర్మాణానికి పార్కులకు సుడా నిధులు 2 కోట్లతో టెండర్లు పిలిచి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్,మేయర్ కొలగాని శ్రీనివాస్,కలెక్టర్ చిత్రా మిశ్రా, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్,అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ మెంబెర్ పడాల రాహుల్ పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**